ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తపరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కొన్ని నెలలుగా ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త పరీక్షలు చేయకుండా ప్రైవేట్ ల్యాబ్‌లకు వైద్యులు రెఫర్ చేస్తున్నారు. ఈ విషయాన్ని శనివారం 'సాక్షి' దినపత్రికలో సర్కార్ దవాఖానాలో సమస్యల తిష్ఠ కథనం ప్రచురించింది. స్పందించిన అడిషనల్ డీఎంహెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు వైద్యం అందించేందుకే మనం ఉన్నదని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని వైద్య సిబ్బందిని హెచ్చరించారు. ఆస్పత్రి ఆవరణలో పర్యటించి ఆవరణలో ఉన్న చెత్తాచెదారం శుభ్రం చేయించకపోవడంపై వైద్యాధికారి మధుసూదన్‌రావ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త పరీక్షలు ఇక్కడ చేయడంలేదని కొందరు రోగులు ఆయన దృష్టికి తీసుకురావడంతో, రెండు మూడు రోజుల్లో నియమిస్తామని హామీ ఇచ్చారు. వారంలోపు తిరిగి ఆస్పత్రిని వస్తానని అంతలోపు తిరిగి ఇవే సమస్యలు ఉంటే వేటు తప్పదని ఆయన హెచ్చరించి వెళ్లారు. గురువారం జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహించేందుకు రామాంజనేయులు నియమించడంతో తిరిగి ఆస్పత్రిలో రక్త పరీక్షలు మొదలయ్యాయి.



రాజాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి

జిల్లా అభివృద్ధికి సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే యెన్నం, తదితరులు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాను దత్తత తీసుకున్నారని, ఎన్నో ఏళ్లుగా ఆగిపోయిన, ప్రాజెక్టులు పూర్తి చేయడానికి నిధులు కూడా తెస్తున్నారని అన్నారు. దేశంలోనే జిల్లాను నంబర్‌వన్ స్థానంలో మార్చడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నాలుగు నెలల్లోనే రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాల గెలుపును సీఎం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా మనం కోరుకున్న అభివృద్ధి సాకారం చేసుకోవడానికి ఇప్పుడు అవకాశం లభించిందని, దీనిని సద్వినియోగం చేసుకుందామన్నారు. మహబూబ్‌నగర్ ప్రజలకు భరోసా కల్పించడానికి ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని, నియోజకవర్గంలోని వేలాది మంది ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలుకుదామని పిలుపునిచ్చారు. వంశీచంద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎంకు బహుమతిగా ఇస్తే రైతులు, విద్యార్థులు, మన బిడ్డల కోసం వేల కోట్ల రూపాయలు వరదలా వస్తాయని తెలిపారు. అనంతరం ఎల్లంగారి భరత్ కుమార్ ఆధ్వర్యంలో 23వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ, ఫయాజ్ పాల్గొన్నారు.

అక్రమకట్టడాలకు అడ్డుకట్ట వేయండి

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం క్రిస్టియన్‌పల్లి రెవెన్యూ గ్రామ శివారులో దివ్యాంగులకు కేటాయించిన స్థలాల్లో అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని ఆర్డీఓ నవీన్‌ను ఉదయ్ అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ దివ్యాంగులకు స్థలాలను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా, రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. స్థలాలను ఆక్రమించుకోవడమే కాకుండా స్థలాలపై బోగస్ పట్టాలు సృష్టించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయమై అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు కలిసి తమ గోడు వెల్లబోసుకున్నా మీనామేషాలు లెక్కిస్తున్నారే తప్ప ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు.

అంబలికేంద్రం ప్రారంభం

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో గురువారం బీజేపీ నాయకుడు రమేష్ అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శంకర్, చందుయాదవ్, రామకృష్ణ, మన్నెంకొండ, గొల్ల బుడ్డన్న, గట్టు సురేందర్, రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

23న బీడీ కూలి పెంపుపై చర్చలు

చిన్నచింతకుంట: బీడీ కూలి పెంపుకై ఈ నెల 23వ తేదీన హైదరాబాద్‌లోని మల్లేపల్లిలో బీడీ ఫ్యాక్టరీ యాజమాని బషీర్‌షేట్ నివాసంలో బీడీ సంఘాల నాయకులు చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దేవదానం గురువారం తెలిపారు. ఈ చర్చలకు యూనియన్ రాష్ట్ర నాయకులతో కలిసి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. చర్చల్లో కార్మికులు వెయ్యి బీడీలు చుడితే రూ.350 చెల్లించే విధంగా డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు.

ఘనంగా సిగ్నేచర్ డే

మహబూబ్‌గనగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం సిగ్నేచర్ డేను ఘనంగా నిర్వహించారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జీవితం అనుభవాలతో కూడుకున్నదని, విద్యతో పాటు విద్యార్థులు నైతిక విలువలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగలక్ష్మి, వాసంతి, రామేశ్వరి, తస్లిమ, యాదయ్య ప్రభాకర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లకు చెందిన కోస్గి చంద్రకాంత్ వారం రోజుల క్రితం మృతి చెందాడు. అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డికి కోరడంతో ఆయన గురువారం రూ.లక్ష నగదును అందించారు. ఆపదలో ఉన్న కుటుంబాన్ని ఆదుకున్న ఎంపీకి కుటుంబసభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా పట్టాభిషేక మహోత్సవం

జడ్చర్ల టౌన్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని పలు ఆలయాల్లో శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పాతబజార్ హనుమాన్ దేవాలయం, హౌసింగ్‌బోర్డు సీతారామాంజనేయస్వామి దేవాలయం, సకల దేవతల ఆలయం, రాంమందిరంలలో వేదపండితుల మంత్రోచ్చరణాలు, జై శ్రీరామ్ నినాదాల మధ్య పట్టాభిషేకం జరిపించారు.

రహదారి.. పచ్చని పందిరి

కోయిల్‌కొండ: కోయిల్‌కొండ-మహబూబ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి మార్గంలో పచ్చదనంతో కూడిన చెట్లు వాహన చోదకులు, ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. ఈ డబుల్‌రోడ్డుకు ఇరువైపులా కళకళలాడుతున్నాయి. ఈ రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులు ఎండవేడిని తట్టుకునేందుకు కొంతసేపు ఈ చెట్లకింద సేదతీరుతున్నారు.


మహబూబ్‌నగర్‌కు వెళ్లే రహదారిపై పచ్చదనంతో కూడిన చెట్లు

కరాటే శిక్షణ సద్వినియోగం చేసుకోండి

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి కరాటే శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఆధ్వర్యంలో వచ్చేనెల 2 నుంచి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న 26వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం బ్రోచర్లను గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల నుంచి కింగ్‌షోటోకాన్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో వేసవిలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని తెలిపారు. పట్టణంలోని విద్యార్థులు, యువకులు శిక్షణ పొందాలని కోరారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ ఈ ఏడాది 26వ వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరాలను జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణ, షాసాబ్‌గుట్టలోని అల్‌నూర్ స్కూల్‌లో వచ్చేనెల 2 తేదీ నుంచి జూన్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7:30 గంటల వరకు శిబిరాలు ఉంటుందని, శిబిరంలో కరాటే, కిక్‌బాక్సింగ్, జూడో, బాక్సింగ్, యోగా, సెల్ఫ్ డిఫెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని చెప్పారు. మిగతా వివరాల కోసం 9849301171 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి చెన్న వీరయ్య, సీజే బెనహర్, సాదుల్లా జునేది, శాంతన్న యాదవ్, ప్రవీణ్‌కుమార్, అర్ష్ జమీల్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: యువత క్రీడల్లో ప్రతిభ చాటాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, సీనియర్ నేత బెక్కరి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం శివారులోని ఎండీసీఏ మైదానంలో గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ సీజన్-7 క్రికెట్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. గురువారం జరిగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో రాథోడ్ రాకర్స్ జట్టు 16 పరుగుల తేడాతో కొమురం భీం జట్టుపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన రాథోడ్ రాకర్స్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 106 పరుగులు చేయగా.. కొమురం భీం జట్టు 12 ఓవర్లలో 92 పరుగులకు ఆలౌట్ అయింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో సేవాలాల్ మహారాజ్ జట్టు 9 వికెట్ల తేడాతో లోకా మసంద్ జట్టుపై విజయం సాధించింది. ఈనెల 21వ తేదీన ఉదయం 8 గంటలకు ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని జీబీపీఎల్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ రవిరాథోడ్, సభ్యులు డాక్యా నాయక్, పున్యానాయక్, మోహన్‌నాయక్, చందర్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవ్ ముదిరాజ్

ప్రమాదకరమైన మలుపులు


నవాబుపేట- యన్మన్‌గండ్ల మలుపు


మైసమ్మ ప్రాంతంలో చిక్కుడు వాగు సమీపంలో ప్రమాదకరమైన మలుపు

నవాబుపేట: మహబూబ్‌నగర్-నవాబుపేట రోడ్డు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్ల వెంట అధికారులు సరైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరుచూ ప్రమాదాలు అవుతున్నాయి. గతంలో సింగిల్ రోడ్డు ఉండగా రోజుకో ప్రమాదం చోటు చేసుకునేది. రోడ్డు డబుల్‌గా మారిన కాస్త ప్రమాదాలు తగ్గిన తరుణంలో సూచిక బోర్డుల సమస్య వచ్చిపడింది. రోడ్డు బాగుందని మితిమీరిన వేగంతో వెళ్లడంతో, మలుపుల వద్ద బోల్తా పడటంతో చాలా ప్రమాదాలు అవుతున్నాయి. మండల కేంద్రం నుంచి మొదలుకుని యన్మన్‌గండ్ల మలుపు, గద్దగుండు మలుపు, రుద్రారం, కాకర్లపహడ్ మలుపు, చిక్కుడువాడు మలుపులు చాలా ప్రమాదమైనవి. ఇక్కడే హెచ్చరిక బోర్డులు కనిపించవు. నవాబుపేట నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డులో రుద్రారం సమీపంలో నాలులు నెలల క్రితం రుద్రారం చెందిన వ్యక్తి రాత్రి కల్వర్టులో పడి మృతి చెందాడు.

ఉన్నతాధికారులకు వివరిస్తాం

రోడ్డులో ప్రమాదాలు తరుచూ అవుతున్నాయి. మైసమ్మ దేవాలయం ప్రాంతం అడవిలో అతివేగంగా వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు వేసిన కొత్తలో 5 ఏళ్ల క్రితం కొన్ని చోట్ల సూచికబోర్డులు ఏర్పాటు చేశాం. అవి కాస్తా పడిపోయాయి. వాటిని మరమ్మతుతో పాటు కొత్తవి ఏర్పాటు చేసేలా అధికారులకు వివరిస్తాం.

– రాములు, ఇన్‌చార్జి ఏఈ

క్లుప్తంగా

రేపు ముఖ్య కార్యకర్తల సమావేశం

రాజాపూర్: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, వెంకట్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఈనెల 20న శనివారం ఉదయం మండల కేంద్రంలోని జేకే గార్డెన్‌లో బాలానగర్, రాజాపూర్ మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాల్లోని ముఖ్యనాయకులు విధిగా హాజరుకావాలని వారు కోరారు.

బీఆర్‌ఎస్ గెలుపు కోసం కృషి చేయాలి

అడ్డాకుల: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం అందరూ కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్ పిలుపునిచ్చారు. మూసాపేట, జానంపేట, వేములలో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 21న అడ్డాకుల మండల కేంద్రంలో ఎన్నికల సన్నాహక సమావేశానికి ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మీనర్సింహ, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ అంజనేయులు, కోఆప్షన్ మదీనా జమీర్, భాస్కర్‌గౌడ్, కొండయ్య, చంద్రశేఖర్, శివరాములు, రఘుపతి రెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీనియర్ జర్నలిస్టు మృతి


రాములు (ఫైల్)

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ చెందిన మాజీ సీనియర్ జర్నలిస్టు రాములు (53) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కొన్ని నెలలుగా శ్వాసకోస వ్యాధితో ఆయన బాధపడుతుండేవారని కుటుంబసభ్యులు తెలిపారు. 25ఏళ్లుగా ఆయన వివిధ దినపత్రికల్లో మండల రిపోర్టర్‌గా పనిచేశారు. భూత్పూర్ మండల రిపోర్టర్లు మృతికి తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

ఉత్తమ పాఠశాలకు బహుమతి ప్రదానం



కోయిల్‌కొండ: శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ పాఠశాలగా తిర్మలంపల్లి ప్రాథమిక పాఠశాల ఎంపికైనట్లు ఫౌండేషన్ సీనియర్ బ్లాక్ మెంటర్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఆపాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు 32లీటర్ల స్టీల్ వాటర్ ఫిల్టర్‌ను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనువాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28 నుంచి వైదిక యువశక్తి నిర్మాణ శిక్షణ

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆర్యసమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దయానంద విద్యా మందిరంలో ఈనెల 28 నుంచి వైదిక యువశక్తి నిర్మాణ బాలుర శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం సభ్యురాలు బాద్మి ప్రవంతి తెలిపారు. శిబిరం మే 4వ తేదీ వరకు ఉంటుందని 16ఏళ్ల లోపు బాలురు శిక్షణకు అర్హులని తెలిపారు. నైతిక విలువలు, మహా పురుషుల జీవితగాథలు, సంధ్య, దేవయజ్ఞం, దైవభక్తి, దేశభక్తి, గురుభక్తి, వేద మంత్రోచ్చరణ, ధ్యానము, ఆటలు ఉంటాయన్నారు.

నేడు ప్రభోత్సవం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి సప్తాహ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున ప్రభోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లను చేశారు. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు స్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. ఆరు రోజులుగా దేవాలయంలో అఖండ భజనలు కొనసాగుతున్నాయి. శనివారం దేవాలయంలో పల్లకీసేవ, డోలారోహనం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు శైవులకు ప్రత్యేకం కావడం వల్ల వివిధ ప్రాంతాల నుంచి శైవ భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారు.

పీయూలో 'వికసిత్ భారత్'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రవీణ హాజరై ప్రసంగించారు. భారత ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నరు. కార్యక్రమంలో అర్జున్‌కుమార్, గాలెన్న, జ్ఞానేశ్వర్, చిన్నాదేవి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరుల సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

- డీడీల డబ్బులు అకౌంట్‌లోకి రావడం సంతోషం
- జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం చైర్మన్ శాంతన్నయాదవ్


మాట్లాడుతున్న శాంతన్న యాదవ్

స్టేషన్ మహబూబ్‌నగర్: గొర్రెల కాపరుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గొర్రెల కాపరుల సహకార సంఘం చైర్మన్ శాంతన్నయాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో గొర్రెల యూనిట్ల కోసం జిల్లావ్యాప్తంగా 16వేలకుపైగా డీడీలు కట్టగా కేవలం 1,370 మందికి మాత్రమే వచ్చిందన్నారు. దీంతో డీడీలు కట్టిన కురుమ యాదవులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, చాలా మంది అప్పులు తెచ్చి డీడీలు కట్టినట్లు తెలిపారు. ఇటు గొర్రెల యూనిట్లు రాక అటు డబ్బులు రాకపోవడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకురావడంతో డీడీల డబ్బులు అకౌంట్లోకి వచ్చినట్లు తెలిపారు. డీడీలు రావడానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో యాదయ్య యాదవ్, నర్సింలు యాదవ్, చందు యాదవ్, నాచ శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్ యాదవ్, రమేశ్ యాదవ్, గోవిందుయాదవ్ పాల్గొన్నారు.

బిల్లులు వెంటనే చెల్లించండి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని టీపీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, బిక్షంగౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండేళ్లుగా సరెండర్, జీపీఎఫ్ బిల్లులు చెల్లించలేదని, ఈ-కుబేర్‌లో ఉన్నట్లు చూపిస్తున్న ఖాతాలలో జమ కాలేదన్నారు. అవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న నిధులు కూడా ఇవ్వడం లేదని, దీని ద్వారా ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. 2011 ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపులు ఇవ్వాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా బాల్‌రాజు, విజయభూషన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

అడ్డాకుల: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ.జితేందర్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముత్యాలంపల్లి చెందిన కాంట్రాక్టర్ కేవీఎస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. కేవీఎస్‌రెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ సుజాత, ప్రతాప్‌రెడ్డి, వార్డు సభ్యులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఇదిలా ఉండగా కొత్తకోట మండలం రామకృష్ణాపురానికి చెందిన భీమ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాములు, మాజీ సర్పంచ్ బుచ్చన్న తదితరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీహరి, అరవింద్‌రెడ్డి, నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, శరత్ కుమార్‌రెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, బుచ్చన్నగౌడ్ తదితరులు ఉన్నారు.


చిన్నచింతకుంటలో కండువా కప్పుతున్న జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ నివాసంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

స్వీపర్లకు వేతనాలు ఇవ్వాలని వినతి


సీఈఓ రాఘవేందర్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని జెడ్పీ హెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్ జీతాలను వెంటనే ఇవ్వాలని స్కూల్ స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెంద్రాయుడు డిమాండ్ చేశారు. గురువారం జెడ్పి సీఈఓ చాంబర్‌లో సీఈఓ రాఘవేందర్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ.. 2023 జూన్ నుంచి ఈ నెల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాలకు చెందిన బిల్లులు సమర్పించినా, జీతాలు సమయానికి ఇవ్వడం లేదన్నారు. తమకు వేతనాలు ఇవ్వడంలో అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. జీతాలను విడుదల చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జమీర్‌బాషా పాల్గొన్నారు.

'సమ సమాజాన్ని నిర్మిద్దాం'

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కుల, మతాల అంతరాలు లేకుండా సమ సమాజాన్ని నిర్మిద్దామని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోపాలకృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 13ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. కుల, మతాలకు అతీతంగా ప్రతి పౌరుడు సమానమే నినాదంతో తమ పార్టీ పని చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమ ఫలాలు అందేలాన్నదే తమ పార్టీ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మీర్జాబేగ్, నవీద్, భూపతి, వెంకట్, అరున్, సుమాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపాలకృష్ణ

తరలిన బీఆర్‌ఎస్ నాయకులు


మిడ్జిల్ నుంచి వెళ్తున్న బీజేపీ కార్యకర్తలు

మిడ్జిల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గురువారం నామినేషన్ కార్యక్రమానికి మిడ్జిల్, ఊర్కొండ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, తిరుపతి, నరేందర్, రవిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి మండలం నుంచి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో రాజు, యాదయ్య, శ్రీను, బాలు, సతీష్, శ్రీనివాస్, శంకర్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

'ఉపాధి' కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

కోయిల్‌కొండ: మండలంలో 'ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువు' శీర్షికన సాక్షి దినపత్రిలో బుధవారం వచ్చిన కథనంతో అధికారులు స్పందించారు. గురువారం మండలంలోని ఉపాధి హామీ పనులు చేస్తున్న స్థలాలకు హుటాహుటిన మండల అధికారులు చేరుకోని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టెంట్లు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ కాళప్ప మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేస్తున్న చోట సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.


పారుపల్లిలో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టెంట్లు ఏర్పాటు చేసిన అధికారులు